# మహిళా మహాస్ఫోటన

## ఆదివిష్ణు

**పాత్రలు :**

గోపాలకృష్ణ : (30-35 సం॥ల వయస్సు)
సత్యానందం : (30-32 సం॥ల వయస్సు)
మంగపతి : (30-31 సం॥ల వయస్సు)
సుబ్బారావు : (55-60 సం॥ల వయస్సు)
సావిత్రి : (25-27 సం॥ల వయస్సు)
స్వాదమ్మ ; [40 45 సం॥ల వయస్సు]

(ఈ నాటికను ముందుగా ఎవరు ప్రదర్శించాలనుకున్నా—ముందుగా రచయిత లిఖిత పూర్వకమైన అనుమతి తీసుకోవాలి)

[సత్యానందం ఇల్లు. అలకరణ సర్వసాధారణంగా వుంది. ఒక గదిలోంచి సత్యానందం పేపర్తో హాల్లోకి వచ్చాడు. కుర్చీలో కూర్చుని తాపీగా మవుసంగా చదువుతున్నాడు. అకస్మాత్తుగా లేచి నించున్నాడు. ఎంతో కుతూహలంగా ఒక ప్రకటన చదువుతున్నాడు.]

**సత్యా:** అఖిలాంధ్ర భార్యా బాధితుల సంఘం (వంటగదిలోకి తొంగిచూసి, ఆ తర్వాత మరింత బిగ్గరగా చదువుతున్నాడు) అఖిలాంధ్ర భార్యా బాధితుల సంఘం ఇన్నీసుపేట రాజమండ్రి. భార్యలచేత బాధింపబడే భర్తలకు శుభవార్త. మీ భార్య చేతిలో మీరు కీలుబొమ్మలా? ఆవిడ చెప్పినట్లల్లా తలూపే గంగిరెద్దులా? దిగులు పడకండి. వెంటనే భార్యా బాధితుల సంఘంలో చేరండి. మంచిరోజులు మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చేస్తాయి. (ఆనందం పట్టలేక అనుకున్నాడు) అహా...ఇంక నేను భయపడ నక్కర్లేదు. మొగుళ్ళ మొర ఆలకించిన ఆపద్బాంధవా? నీకు శతకోటి వందనాలు. (మళ్ళీ చదివేశు) భార్యా బాధితుల సంఘంలో చేరగానే భార్యలను లొంగదీసుకునే చిట్కాలు మొదటి వారంలో చెప్పబడతాయి. రెండోవారం వాటిని ప్రయోగించ బడతాయి. ముచ్చటగా మూడోవారం నుంచే సత్ఫలితాలు పొందుతారు. మీ సభ్యత్వం కోసం వెంటనే సంప్రదించండి.—ఒక మాజీభార్యా బాధితుడు. డోరు నెం. 123, ఇన్నీసుపేట రాజమండ్రి.

(సత్యానందం పేపరు మడిచి అటూ ఇటూ తిరుగుతూ అనుకుంటున్నాడు) ఇన్నీసుపేట రాజమండ్రి. రాజమండ్రి ఇన్నీసుపేట.

(లోపల్నుంచి సావిత్రి వస్తోంది. అతని వరస గమనించింది క్షణం సేపు. ఆ తర్వాత అక్కడ నిలబడి అతన్ని పిలిచింది).

**సావి:** ఏమండీ?

**సత్యా:** (తిరుగుతూనే వున్నాడు) ఇన్నీసుపేట రాజమండ్రి.

**సావి:** (ఆశ్చర్యంగా) ఇన్నీసుపేట.

సత్యా: రాజమండ్రి.
సావి: ఏమిటా దండకం?
సత్యా: ఇన్నీసుపేట రాజమండ్రి.
సావి: (అరిచింది) ఇదుగో...మిమ్మల్నే!
(ఆ అరుపుకి సత్యానందం జడుసుకున్నాడు. తక్షణం ఆగిపోతాడు. భార్యని చూస్తూ క్షణంసేపు మాటాడలేదు. ఆ తర్వాత వినయంగా అడిగాడు)
సత్యా: పిలిచావా సావిత్రీ?
సావి: కాదు. అరిచాను! (వస్తూ) మాయదారి గోలంట. మాయదారిగోల. ఇన్నీసుపేట రాజమండ్రి అంటూ ఎక్కాలు చదువుతుంటే నా పిలుపులేం వినిపిస్తాయి? ఇంతకీ ఇన్నీసుపేటేమిటి? రాజమండ్రేమిటి?
(సత్యానందం పేపరు దాచేస్తూ, దిగులుగా అన్నాడు)
సత్యా: ఓ! అదా! అదీ?
సావి: ఊ...అదే! ఏమిటని అడుగుతున్నాను.
సత్యా: అదే! ఇవాళ ఆదివారం గదా!
సావి: ఊ...అయితే?
సత్యా: ఆదివారంనాడు ఇన్నీసుపేట రాజమండ్రి అంటూ ఇరవైసార్లనుకుంటే-
సావి: ఊ...అనుకుంటే?
సత్యా: ఆ భర్త తన భార్యకి చేసే సేవలన్నీ సక్రమంగా వుంటాయిట.
సావి: (ఆనందంగా) మరి చెప్పరే? ఆ మంత్రాన్ని ఇప్పటికి ఎన్నిసార్లను కున్నారు?
సత్యా: పదిహేడు!
సావి: ఊ...కానివ్వండి. మిగతా మూడుసార్లూ గబగబా అనేసుకోండి. ఎంచక్కా నాకు సేవలు చేసుకోవచ్చు.
సత్యా: అట్లాగే! ఇన్నీసుపేట రాజమండ్రి. రాజమండ్రి ఇన్నీసుపేట ఇన్నీసుపేట రాజమండ్రి అమ్మయ్య అయిపోయింది సావిత్రీ!
సావి: బాగానే వుంది. బస్సు కండక్టరులాగా బాగానే అన్నారు?
సత్యా: ఎగతాళి చేయకూడదు సావిత్రీ! ఇదొక వ్రతం. భార్యావ్రతం. ఎంత నిష్టగాచేస్తే ఆ భర్త ఆ భార్యకి అంత దాసానుదాసుడవుతాడు.
సావి: మంచి వ్రతమే! ఇంతకీ ఆ వ్రతం గురించి చెప్పిన పుణ్యాత్ముడెవరో?
సత్యా: (పేపరు చూపెడుతూ) వివరాలన్నీ ఈ పేపర్లో వున్నాయి.
సావి: అట్లాగా! ఏదీ ఇల్లా ఇవ్వండీ?
సత్యా: (చేసిన పొరపాటు గుర్తుకొచ్చింది భయపడ్డాడు. పేపరు దాచేస్తూ) వద్దులే! మొత్తం నే చదివేసాగా?
సావి: ఏం చదివారో ఏమో? నన్నుకూడా చదవనీండి.

**సత్యా:** సావిత్రీ! (భయంగా అన్నాడు)
**సావి:** మామూలు వ్రతంకోసం కాదు. భార్యావ్రతం! వ్రతంలో చెప్పినవన్నీ మీచేత శ్రద్ధగా చేయించాలంటే నేను కూడా చదవాలిగా! ఇవ్వండి.
**సత్యా:** (భయంగా) ఊహూ...వద్దు!
**సావి:** (గద్దించింది) ఇవ్వమంటుంటే-
(పేపరు లాక్కుంది. ప్రకటన చూస్తోంది. సత్యానందం అటు తిరిగి జుట్టు పీక్కుంటున్నాడు.)
**సావి:** అఖిలాంధ్ర భార్యా బాధితుల సంఘం!
(సత్యానందం చెవులు మూసుకున్నాడు)
**సావి;** ఇన్నీసుపేట. రాజమండ్రి. భార్యలచేత బాధింపబడే భర్తలకు శుభవార్త.
**సత్యా:** (అరిచాడు) భగవాన్!
**సావి:** మీ భార్య చేతిలో మీరు కీలుబొమ్మలా? ఆవిడ చెప్పినట్లల్లా తలూపే గంగిరెద్దులా? దిగులు పడకండి! (భర్తతో) ఏమిటి వీడి పిండాకూడు రాతలూ వీడూను! భార్యకి భయపడని భర్త భూలోకంలో అసలుంటాడా?
**సత్యా:** (అరిచాడు) ఎందుకుంటాడూ? వుండడు!
**సావి:** మరెందుకీ పిచ్చిరాతలు?
(అని పేపరు నేలమీదికి విసిరి కొట్టింది.)
**సావి:** ఇలాంటి పాపిష్టి రాతలు చదివి చెడిపోవాలను కుంటున్నారా?
**సత్యా;** ఊహూ-చెడిపోను.
**సావి:** చాల్లే ఊరుకోండి. కడుపులోకుట్రపెట్టుకుని నన్ను మాయచేయాలనుకున్నారు గదూ! ఇదుగో...ఇప్పుడే చెప్తున్నా! మళ్ళీ ఇంకో తడవ ఇన్నీసుపేట పేరెత్తినా ఆ దిక్కుమాలిన పేటలో అడుగుపెట్టినట్టు తెలిసినా-మీకు పుట్టగతుల్లేకుండా చేస్తాను జాగర్త.
(అని వంట గదిలోకి వెళ్ళిపోయింది. సత్యానందం కుర్చీలో కూలబడిపోతూ అనుకున్నాడు.)
సత్యా, గోవింద! ఇంకేం వెడతాను ఇన్నీసుపేట? నేనిక్కైనా ప్రాప్తముండాలనుకుంటాను. ఇందుకే కాబోలు!
(సావిత్రి బియ్యం చేటతో తిరిగొచ్చింది)
**సావి:** ఊ...తీసుకోండి.
**సత్యా:** ఏమిటిదీ?
**సావి:** చేట. కనిపించడం లేదా?
సత్యా: కనిపిస్తూనే వుంది. అందులో బియ్యం కూడా వున్నట్లున్నాయి.
సావి: బియ్యంలో రాళ్ళు కూడా వున్నాయి. తీసుకోండి ముందు.
**సత్యా:** (తీసుకోకుండానే) తీసుకుని ఏంచేయాలి?

సావి: రాళ్ళు ఏరాలి?

సత్యా: ఎవరు?

సావి: మీరే?

సత్యా: (షాకై పోతాడు) సావిత్రీ... చివరికి నన్ను బియ్యమేరే లెవెల్లో పారేసావా?

సావి: ఎందుకట్లా గాబరా పడతారూ? కొండలు పిండిచేయమన్నానా? కాలువలు పూడ్చమన్నానా? బియ్యంలో రాళ్ళు ఏరమన్నాను. అంతేగా.

సత్యా: అంతే అనుకో! కానీ-దీనికంటే కొండల్ని పిండిచేయటం, కాలవల్ని పూడ్చి పెట్టడమే బెటరు! (చేటవేపు చూపెడుతూ) ఇదేమొ...ఆడంగులు చేసేపని కాబోలు!

సావి: ఏం ఫర్లేదు. మగాళ్ళు కూడా చేయచ్చు. అయినా-మగాళ్ళు బియ్యంలో రాళ్ళేరకూడదని రూలేమైనా వుందా?

సత్యా: లేదనుకో!

సావి: మరింకే! తీసుకోండి,

(తీసుకోక తప్పిందికాదు. తీసుకుంటానే అన్నాడు)

సత్యా: ఇవాళ ఆదివారంగదా-ఎవరైనా ఇంటికొస్తారేమో సావిత్రీ!

సావి: వస్తే ఏమవుతుందిట?

సత్యా: వాళ్ళముందు ఈ చేటపని ఏం బావుంటుంది చెప్పు?

సావి: ఎందుకు బావుండదూ! మన ఇంటిపన్లు మనం చేసుకుంటే తప్పా?

సత్యా: తప్పు కాదనుకో! ఎంతైనా ఇది చేట. నా చేతిలో వుంటే ఆడంగి వెధవనుకుంటారేమో?

సావి: ఇంటి పనుల్లో ఆడామగా తేడాలుండవని చెప్పానా?

సత్యా: చెప్పావు!

సావి: అంచేత ఇక నసపెట్టకండి. అంతెందుకూ- మా కుసుమ మొగుడు లేడూ?

సత్యా: వున్నాడు. అతను కూడా బియ్యంలో రాళ్ళేరుతూ వుంటాడా?

సావి: అంతేకాదు. అంట్లుకూడా తోముతాడు.

సత్యా: మరి చెప్పవే! అతనికంటే నేనే బెటరు. బట్టలు మాత్రమే ఉతుకుతాను! కదూ?

సావి: అంటే? అంట్లు తోమరా?

సత్యా: అని కాదనుకో!

సావి: అనుకోడాల్లేవు! అవసరమైతే తోమాల్సిందే!

సత్యా: అట్లాగే! తోముతాను. ఎందుకు తోమనూ!

సావి: ఊ...ఊ... ముందు చెప్పినపని కానివ్వండి.

సత్యా: చేటపనికదా! చేస్తాను. అంటూ (వెళ్ళబోతాడు)

సావి: ఆగండి! (ఆగాడు) అటెక్కడికి?

సత్యా: తలుపేసి వస్తాను సావిత్రీ!

సావి: ఏవక్కర్లేదు. తెరిచే వుంచండి!
సత్యా: ఎవరైనా మగాళ్ళు వస్తారేమో?
సావి: (మొగుడు మీదికి రయ్యిన వెళ్ళింది) ఇందాకట్నుంచీ చూస్తున్నాను. అసలేమిటి మీ ఉద్దేశం? బియ్యమేరడం, అంట్లు తోమడం, పప్పు రుబ్బడం-ఇవన్నీ ఆడంగి పనులనుకుంటున్నారా?
సత్యా: నేనా? రామరామ! ఆఫీల్డులో పండిపోయినవాణ్ని! నేనెందుకనుకుంటానూ? గిట్టనివాళ్ళు చూస్తే అనుకుంటారేమోనని-
సావి: ఎవరండీ ఆ గిట్టని వాళ్ళు! మచ్చుకి ఒక్కళ్ళని చూపించండి. అందరూ వాళ్ళవాళ్ళ ఇళ్ళల్లో చేసే పనులే ఇవి.
సత్యా: కొందరు చేయరేమోనని డవుటు సావిత్రీ!
సావి: చాల్లే వూరుకోండి. డవుటు ముందుపుట్టి తర్వాత మీరు పుట్టారు. ఇల్లాలంటే ఏమనుకుంటున్నారు?
సత్యా: ఇంటికి దీపమని మొన్నేగా చెప్పావు. మరిచిపోలేదు.
సావి: అవునా మరలాంటి దీపంలాంటి ఇల్లాలిమాట వినకపోతే ఇల్లు చీకటైపోతుంది. మీ కళ్ళు పేలిపోతాయి. ఊ...ఊ... ముందు బియ్యంపని చూడండి.
[సత్యానందం గబగబా రాళ్ళేరుతున్నాడు]
సావి: ఆపని అయ్యాక బియ్యం కడిగి ఎసట్లో వేయండి.
సత్యా: అంటే? ఇవాళ వంట కూడా నన్నే చెయ్యమంటావా?
సావి: తప్పదుమరి! నేను మార్నింగ్‌షోకి వెడుతున్నాగా.
సత్యా: (ఆనందంగా) మార్నింగ్‌షోకా? నేకూడా వస్తే ఎలా వుంటుంది?
సావి: ఏడ్చినట్టుంటుంది! మార్నింగ్‌షోలు ఆడవాళ్ళకోసమే వుంటాయి.
సత్యా: అలాంటప్పుడు వాటిని మార్నింగ్‌షోలనే దానికంటే మహిళాషోలంటే బెటరేమో!
సావి: ఏ పేరుతో పిలిచినా అవి మాకోసమే వేస్తారు హైదరాబాదు వెళ్ళిచూడండి. మగాళ్ళంతా ఆఫీసుకెళ్ళి పోయాక-ఆడాళ్ళంతా మార్నింగ్‌షోకి వెళ్ళిపోతారు.
సత్యా: హైదరాబాదు పద్ధతి ఈ ఊరుకూడా వచ్చేసిందా?
సావి రాకూడదనే రూలేమైనా వుందా? ఆడవాళ్ళు ఆడవాళ్ళే. ఎక్కడున్నా వాళ్ళ-పద్ధతుల్లో మార్పులుండవు.
సత్యా: ఆపాటి ఐక్యత మగాళ్ళలో వుంటే-ఈ చేట పనులు తప్పేవి!
సావి. (టైం చూసుకుంది) అమ్మో! టైంలేదు మీతో వాదన పెట్టుకుంటే అక్కడ ఇంటర్వెల్లవుతుంది. వెళ్ళి వంటపని చూడండి.
[టేబిల్ దగ్గరకెళ్ళి వేనిటీబాగు తీసుకుంటో, చెప్పులు తొడుక్కుంటో చెబుతోంది]
సావి: సినిమా అయ్యేసరికి మధ్యాహ్నం ఒంటి గంటవుతుంది! ఆవేళకి కడుపులో ఎలుకలు పడతాయి. అంచేత వంటచేసి సిద్ధంగా వుంచండి.

సత్యా: అట్లాగే!

సావి: [వెళ్ళిపోతూ చెబుతోంది] పగటిపూట ఆఫీసులో నిద్రపోతున్నట్టు-ఇంట్లో కూడా నిద్రపోకండి, వంటపని ఆగిపోతుంది. వస్తా!

[అని ఆమె సుడిగాలిలా వెళ్ళిపోయింది. సత్యానందం క్షణం అట్లాగే నిలబడి ఆ తర్వాత గుమ్మంవేపు నడుస్తూ గొణుక్కుంటున్నాడు]

సత్యా: ముందు తలుపు బిగిస్తే సేఫుగా వుంటుంది. తలుపు వేసి వస్తూ హాల్లో ఒక చోట ఆగిపోతాడు. తండ్రిఫొటో చూస్తూ అన్నాడు. చేతితో చేట హారతిలా పట్టుకున్నాడు.] చూడు నాన్నా! బాగా చూడు! నా చేతిలో చేటపెట్టి తాను సినిమాకి వెళ్ళిపోయింది. ఇందుకేనా నన్ను పెళ్ళిచేసుకోమన్నావ్? చచ్చి ఎక్కడున్నావో గాని ఫాదర్-నాకు పెళ్ళిచేసి నన్నుకూడా చంపేశావ్! మా ఇద్దర్లో మొగుడెవరో పెళ్ళామెవరో తెలీక అల్లాడి పోతున్నాను. ఈ గజ్జల గుర్రాన్ని నాకు అంటగట్టి నువ్వు బాల్చి తన్నేసావ్. ఇదేమో రోజుకో రకంగా నామీదెక్కి స్వారీచేస్తోంది. స్వారీ...

[తలుపు శబ్దమైంది. ఉలిక్కి పడ్డాడు. ఇంకా శబ్దమవుతోంది. చేతిలో చేటనిచూసి గుటక వేసాడు.]

సత్యా: ఎవరదీ!

బయటవ్యక్తి: తలుపుతీయ్.

సత్యా: ఎవరంటుంటే?

వ్యక్తి: నేనురా! గోపాలక్రిష్ణని!

సత్యా: [గొణుక్కున్నాడు] అమ్మో! ఈ గోపిగాడు ఆకాశవాణిలాటివాడు. నన్నీ స్థితిలో చూశాడంటే చచ్చినంత పనవుతుంది.

గోపా: తలుపు తీయరా!

సత్యా: [ఖంగారుగా] వుండుండు వస్తున్నా!

[బియ్యం చేటని వంటగదిలో పెట్టేసి-చేతులు దులుపుకుంటూ వచ్చాడు]

గోపా: ఒరేయ్...తలుపు తీయరా!

[సత్యానందం తలుపు తీసాడు. గోపాలకృష్ణ చేతులు వెనక్కి పెట్టుకుని దర్జాపోజులో వస్తూ పరిసరాలు పరిశీలిస్తున్నాడు. సత్యానందం భయపడుతున్నాడు].

గోపా: ఇంతసేపూ ఏంచేస్తున్నావురా?

సత్యా: [వళ్ళుమండి అన్నాడు] గోళ్ళు గిల్లుకుంటున్నాను!

గోపా: గోళ్ళా?

సత్యా: లేకపోతే ఏమిటి నీ చచ్చు ప్రశ్న!

గోపా: అహ! ఎంత బాదినా తలుపు తీయక పోతేనూ-ఏదైనా చెప్పకూడని కార్యక్రమం పెట్టుకున్నావేమోనని-

సత్యా: చెప్పకూడని కార్యక్రమం అంటే? [భయంగా అడిగాడు]

గోపా: ఆదివారంగదా! చెల్లాయితో కులాసాగా-

సత్యా: చంపేస్తానొరేయ్. పిచ్చిపిచ్చిగా మాటాడకు. ఎప్పుడు పడితే అప్పుడు

పెళ్ళాంతో సరసాలాడటానికి నేను చవట్నేం కాదు!

**గోపా.** ఆపని చవటలే చేస్తారా?

**సత్యా** పెళ్ళాన్ని మెప్పించి ఆవిడ కరుణా కటాక్షాలు కోరేవాళ్ళంతా ఆపనే చేస్తారు మన్సంగతి అట్లాకాదు చెటాఫట్! ఇంతకీ ఎందుకొచ్చినట్టు?

**గోపా** [అటూఇటూ చూస్తూ] చెల్లాయి యింట్లో లేదా ఏమిటి?

**సత్యా** వుంటె ఇంట్లో వుండక ఎక్కడ చస్తుంది! ఇంట్లోనే వుంది!

**గోపా:** అబ్బ ఏం నోర్రా!

**సత్యా:** అంతేమరి! నాకు మామూలు మాటలురావు. ఇంతకీదాన్తో నీకు పనేమిటి?

**గోపా:** మరేం లేదు! తలుపు నువ్వు తీస్తేనూ?

**సత్యా:** [బెదిరి అన్నాడు] అదా! అదంతేలే! వంట గదిలోంచి కదలొద్దని ఆర్డరు వేశాను.

**గోపా:** అనుకూల దాంపత్యమంటే అట్లా వుండాలి? ఒరే-నిన్ను చూస్తుంటే ఈర్ష్యగా వుందిరా సత్యానందం! ఆర్డర్లేసి కాపరాన్ని ఆనందంగా సాగిస్తున్నావ్!

**సత్యా:** థేంక్యూ! నేనొకటి చెప్తా విను. కాపరం తగలబడిపోయినా-కళకళలాడు తున్నా-దానిక్కారణం ఆడదే! అలుసిస్తే నెత్తినెక్కుతుంది. ఆ దెబ్బతో కాపురం దివాళా తీస్తుంది! ఆడదానికి కళ్ళెంవేసి అదుపులో వుంచావనుకో-ఆ ఇల్లు హరివిల్లవు తుంది!

**గోపా:** కళ్ళెం గట్రాలు వేయాలంటే అప్పుడప్పుడు చెయ్యి చేసుకోవాలేమో గదరా!

**సత్యా:** తప్పని సరైతే తప్పదుమరి! అంతెందుకూ ఇప్పుడేం జరిగిందో తెలుసా? మార్నింగ్‌షోకి వెడదామంది మా ఆవిడ....మార్నింగూ లేదూ, మ్యాట్నీ లేదూ నోరు మూసుక్కూచోమన్నాను, కొంచెం మారాం చేసింది. అంతే! గబగబా నాలుగిచ్చే శాను ఫినిష్. బుద్ధిగా పొయ్యిముందు కూచుంది!

**గోపా:** ఏమిటోరా! పాడు ఆదివారం! మా ఇంటోనూ ఇదే గొడవ. మా మాలతి కూడా మార్నింగ్‌షోకి వెడతానంది. వీల్లేదన్నాను. ఇల్లుకదిలావంటే తాళ్ళు విరగ్గొడతా నన్నాను. ఒక మూలచేరి గొణుక్కుంటుంటే నాక్కోపం వచ్చింది. బెల్టుతీసి ఉతికే శాను.

**సత్యా:** సెబాష్...మగాడన్న తర్వాత ఆపాటి స్పీడు వుండాల్సిందే!

**గోపా:** ఏమి స్పీడో...చితక బాదేసానేగాని-అదెంత ఏడుస్తుందోనని యిప్పుడు ఫీలై పోతున్నాను.

**సత్యా:** అదే తప్పు! మా ఆవిడ్ని ఎప్పుడు కొట్టినా నేనసలు ఫీలవ్వనే అవ్వను. ఎంచేత అడుగు?

**గోపా** ఎంచేత?

**సత్యా** ఫీలవుతున్నట్టు తెలుస్తే కథ అడ్డం తిరుగుతుంది గోపాలక్రిష్ణా! ఎంత ఉడుకుతున్నా మొగుడు ఉత్త సిక్ వెధవని పసిగట్టేసి మెలోడ్రామా డైలాగుల్తో

వాళ్ళ మనసు కరిగించేసి ఆ పైన వాడినెత్తి నెక్కుతారు.

**గోపా:** నిజానికి మా మాలతి మంచి ఆడదేరా! ఉత్తమ ఇల్లాలు. కాకపోతే ఈ పాడు సినిమా యావతో నాకు చిరాకు వచ్చేస్తుంది. చిరాకొచ్చిందంటే నన్ను పట్టుకో లేరు. శివతాండవం చేస్తానన్నమాట. కాలే వాడతానో చెయ్యే వాడతానో నాకే తెలీదు. పచ్చడి పచ్చడి కింద చితక బాదేస్తేనేగాని చిరాకు తగ్గదు. ఇవాళ అగ్గి చేశాను.. ఇంట్లో ఒక్కర్తీ ఏ విషాదపు పాటలు పాడుతుందో ఏమో పిచ్చి మాలతి!

**సత్యా:** గోపాలక్రిష్ణా థేంకవమాకు! టేకిటీజీ! నీక్యూటీ సువ్వు చేశావు! ఆ మాట కొస్తే ప్రతి ఆదివారంనాడు మా ఆవిడ్ని ఉతికేస్తుంటాను. ఎంచేతో అడుగు.

**గోపా:** ఎంచేత?

**సత్యా:** అట్లా ఉతకడంవల్ల వారంలో మిగతా రోజులు ఏ గొడవా లేకుండా హాయిగా గడుస్తాయి.

**గోపా.** నిజమే అనుకో! మనం కొట్టే దెబ్బలు భరించలేక వాళ్ళేదైనా అఘాయిత్యం చేస్తేనో?

**సత్యా** అంటే?

**గోపా.** అదేరా! బ్రతుకుమీద విరక్తి పుట్టి కిరసనాయిలు పోసుకుని అంటించుకో వచ్చుగదా!

**సత్యా:** అందుకే మా యింటిలో కిరసనాయిలు వుంచను.

**గోపా:** నూతిలో దూకితేనో?

**సత్యా:** నెవ్వర్...మాదొడ్లో నుయ్యిలేదు. అయినా ఒరే గోపాలక్రిష్ణా-చస్తాను చస్తానని బెదిరించే ఆడది చస్తే చావదు. అది రూలు. మొగుడు కొట్టినంత మాత్రానికే నూతులూ గోతులూ చూసుకుంటే-ప్రతిరోజూ వేలూ లక్షల్లో చస్తారు పెళ్ళాలు!

[గోపాలక్రిష్ణ ఏదో మాటాడ బోయాడు. దిగులుగా లోపలికి వస్తున్న సుబ్బారావుని చూసి మాటలాపేశాడు. సుబ్బారావు ఎవర్తోనూ మాటాడకుండా తిన్నగా వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. సత్యానందానికి దవుటు కలిగింది. అందుకే అడిగాడు సుబ్బారావుని]

**సత్యా:** ఏమిటా పోజు దివాళా తీసినట్టు!

[సుబ్బారావు మొహాన్ని చేతుల్తో కప్పేసుకుని మొఖ్ఖున ఏడ్చే ప్రయత్నం చేయబో తాడు గోపాలక్రిష్ణ గాభరా పడిపోతున్నాడు]

**గోపా** ఏడవకురా! ఏడవకు! అసలేం జరిగిందో చెప్పు!

**సుబ్బా.** [ఇద్దరివేపూ చూసి దిగులుగా అన్నాడు] మా ఆవిడ నాకు అన్నం పెట్టనంది!

**సత్యా:** అమ్మో! అంత మాటనేసిందా?

**గోపా** ఎంత ధైర్యం! కట్టుకున్న మొగుడుకి అన్నం పెట్టనందా? బెల్టూడదీసి కొట్టాల్సింది!

సత్యా: కరెక్టు! అదే సరైన ట్రీట్‌మెంటు!
సుబ్బా: కొడదామనే అనుకున్నాను కానీ తిరగబడి కొడుతుందేమోనని భయ పడ్డాను.
సత్యా: ఓరి చచ్చు పీనుగా! భయపడితే ఇంతంతే! నువ్వు బానిసవటం కల్ల!
సుబ్బా: హో! ప్రేమించి పెళ్ళిచేసు కున్నందుకు బాగానే బుద్ధి చెప్తోంది! ప్రేమించే రోజుల్లో ఆవిడ నా కంటికి ఒక దేవతలాగా-అనురాగ జ్యోతిలాగా కనిపించేది. పెళ్ళయ్యాక దెయ్యంలాగా మారిపోయింది.
సత్యా: సుబ్బారావ్-దీన్నే మాయ అంటారు. ప్రేమ వేరు పెళ్ళి వేరు ప్రేమ పిప్పరమెంటు బిళ్ళలాగా తియ్యగా తిమ్మిరిగా ఉంటుంది. పెళ్ళయ్యాక రుచి మారు తుంది పరమ చేదుగా తగలడుతుంది! ఈ సూత్రం అర్థం చేసుకుని తగిన జాగ్ర త్తలు తీసుకున్నవాడే మగవాడు
గోపా. అసలు మీకు తగువెందు కొచ్చిందిరా!
సుబ్బా: రీజను సింపులే! కాకరకాయ వేపుడు చెయ్యమన్నాను
సత్యా: అంటామండీ! మగపుట్టుక పుట్టిం తర్వాత యిష్టం వచ్చిన కూరలు చేయిం చుకు తింటాం!
సుబ్బా; కానీ మా ఆవిడ కాకరకాయ వేపుడు వేయనంది నచ్చినాసరే చేయనంది.
గోపా: ఎంత అసహ్యమైతే మాత్రం-మొగుడికోసం వండాల్సిందే!
సత్యా; వరెగ్జాంపుల్! మా ఆవిడ్నే తీసుకో! సావిత్రీ చేపల పులుసు పెట్టూ అన్నా ననుకో! ఫినిష్. నిమిషాల్లో తయారు చేస్తుంది.
సుబ్బా: మీరు శాకాహారులు గదా-చేపల పులుసంటావేమిటి?
సత్యా: అదేమరి! ఎంత శాకాహారులమైనా, నాకు తినాలనిపిస్తే కుక్కని చూసి కూరవండమన్నాననుకో! వండేస్తుంది! అల్లావుండేనే భార్య! వుండకపోతే గెటవుటే!
సుబ్బా: అమ్మో! అంతమాట నేను అనగలనా?
గోపా: అనాలిరా! మగాడికి-ఆ హక్కుంది. నీ దిక్కున్నచోట చెప్పుకో పొమ్మని మెడపెట్టి గెంటేస్తేనేగాని ఆడదానికి బుద్ధిరాదు.
సుబ్బా: మా మావ పోలీసు ఇన్‌స్పెక్టరుగదా! బొక్కలో తోస్తాడేమోరా
సత్యా: ఎంత ఇన్‌స్పెక్టరైతే మాత్రం? అనుకూలంగా వుండాల్సిన మనిషిమగాకాదు చేస్తున్నప్పుడు పొమ్మనడానికి లా అండ్ ఆర్డరు అడ్డంరాదు!
సుబ్బా: నన్ను కొంచెం పట్టుకుంటారా?
గోపా: ఏ' మా మాటలు విని భయపడ్తున్నావా?
సుబ్బా: కాదు! ఆకలికి కళ్ళు తిరుగుతున్నాయ్! ఫోంచేసి రెండు రోజులైంది!
సత్యా: అంటే? రెండు రోజుల్నుంచీ నీకు మీ ఆవిడ అన్నం పెట్టడం లేదా?
సుబ్బా: లేదు!
గోపా: ఈ విధంగా ఎన్ని రోజులు నీ కడుపు మాడుస్తుంది?
సుబ్బా: తెలీదు!

సత్యా పోనీ-తను భోంచేస్తోందా,
సుబ్బా సుబ్బరంగా చేస్తోంది! నా కిష్టమైన కాకరకాయ వేపుడు కూడా వేసుకుని నన్ను ఊరిస్తూ తింటోంది.
సత్యా ఛీ ..ఛీ...ఏం బతుకు బతుకుతున్నావురా సుబ్బారావ్? వెధవబతుకు.
గోపా పోనీ హోటల్లో భోంచేయవచ్చు గదరా!
సుబ్బా వచ్చు! కానీ, ఆ సంగతి మా ఆవిడికి తెలుస్తే యింకా ఏమైనా వుందా ఇంటో అడుగు పెట్టనీదు' అరుగుమీదే కాలక్షేపం చేయుమని దిండూ దుప్పటీ బయట పారేస్తుంది!
సత్యా ఆ పాపపు శిక్ష యింతకు ముందెప్పుడైన అనుభవించావా?
సుబ్బా నెలలో సగం నేను అరుగు మీదే కాలక్షేపం చేస్తుంటా!
గోపా. చెప్పుకోడానికి సిగ్గులేదురా?
సుబ్బా. చెప్పుకుంటే కొంత బరువు తగ్గుతుంది గదా! సిగ్గనుకుంటే ఎట్లా? సత్యానందం కొంచెం కాఫీ యిప్పించవూ?
సత్యా (బెదిరాడు) కాఫీయా! అట్లాగే! (వంటగది వేపు కదిలి ఆగి) కాఫీయేగదా! (ఆగిపోయి అరిచాడు) సావిత్రీ! మూడు కాఫీ! క్విక్!
సుబ్బా. అదృష్టవంతుడివి! హోటల్లో అరిచినట్టు అరుస్తున్నావ్!
సత్యా: ఎంచేతని అడుగు.
సుబ్బా. ఎంచేత?
సత్యా మాది అనుకూల దాంపత్యం. ఆ మాట వీరు కూడా అన్నారు. (గోపాల క్రిష్ణతో) ఏరా, అన్నావుగదూ!
గోపా ఇప్పుడు మన సంగతి ఎందుకురేరా? ముందు వీడికి కాఫీ ఏర్పాటుచూడు.
సత్యా (మళ్ళీ అరిచాడు) సావిత్రీ-నీకే చెప్తూంట! మూడు కాఫీలు!
గోపా: సమాధానం రాదేమిరా? (సత్యానందాన్ని అడిగాడు)
సత్యా మాటాడొద్దని ఆర్డరేసానుగదా! (అరిచాడు) సావిత్రీ-
సుబ్బా. (భయంగా) తొందర పెట్టకు. నా మూలంగా నువ్వు కష్టాల పాలవడం ఇష్టంలేదు
సత్యా: చెత్తగా మాటాడకు! ఆ ఆవిడ నాకు ఎదురు చెబుతుందనా నీ ఉద్దేశం? (అరిచాడు) సావిత్రీ-(ఫ్రండ్సుతో) జస్టేమినిట్. కాఫీ ఎంత వరకు వచ్చిందో చూసి వస్తాను.
(అని అతను వంట గదిలోకి వెళ్ళిపోయాడు.)
సుబ్బా: తలదాలని ఇట్టే పెళ్ళాలొస్తారని ఎక్కడో చదివాను సత్యానందం చాలా అదృష్టవంతుడు.
గోపా: నా మట్టుకు నేనూ అదృష్టవంతుడ్నేరా? మా మాలతి కూడా నన్ను చూస్తే వణికి ఛస్తుంది. మొన్నీ మధ్య కోపమొచ్చి కళ్ళెర్ర చేసాను. అంతే జ్వరమొచ్చి

మంచ మెక్కింది పిచ్చి మాలతి!

(వంట గదిలోంచి సత్యానందం అరుపులు వినిపిస్తున్నాయి)

**సత్యా:** ఏమిట్రా? వాట్ ఈజ్ దిస్? (ఫ్రెండ్సు మొహమొహాలు చూసుకుంటున్నారు) కాఫీ పెట్టమంటే టీ ఎందుకు చేశావ్? డోంటాక్. పారెయ్. నీకే చెప్తూంటే! విసిరి పారేయ్!

(కప్పుయీ సాసర్లూ పగిలిన శబ్దం కంచం కూడా భళ్ళుమన్నది)

**సత్యా.** చెప్పింది చెప్పినట్టు చెయ్యకపోతే డొక్క చింపేస్తానని తెలీదా? ఊ..., నోరెత్తావంటే పీక పిసికేస్తా జాగర్త! ఫ్రెండ్సు (భయపడుతున్నారు) కాఫీ అని గొంతు చించుకుంటే టీ చేస్తావా? టీ; మొన్న 'కూడా అంతే! సెవెంటీ సెంటీగ్రేడులో నీళ్ళు కాయమన్నాను వంద సెంటీగ్రేడుపెట్టి నాదుంప తెంచావ్; అట్లా బేలచూపులు చూడకు నేను భస్తే కరగను ఇప్పుడు నువ్వు చేసిన తప్పుకి శిక్షేమిటో తెలుసా? ఏడవకు...ఏడ్చావంటే ఎగిరి తంతాను జాగ్రత్త ఫుట్‌బాల్‌ని తన్నినట్టు తన్నేస్తానంతే! ఎప్పుడు నువ్వేం చెయ్యక్కర్లేదు ఈ ఇంట్లో నేనుగానీ మా ఫ్రెండ్సుగానీ కాఫీ తాగనే తాగం! ఎంచక్కా హోటల్లో తాగుతాం' తప్పుకో నాకాళ్ళు విడిచిపెట్టు ఊ ..నీకే చెప్తూంటే!ఊ...

(అని ఊపులో బయట కొచ్చేసాడు ఉగ్రమూర్తిలా ఉన్న సత్యానందాన్ని చూసి మిత్రులు బిక్కమొగం పెట్టేశారు).

**సుబ్బా:** సారీరా! అనవసరంగా ఇబ్బంది పెట్టేశాను

**సత్యా:** ఇట్సాల్‌రైట్...దాన్ని గురించి నువ్వు వర్రీ కావద్దు ఆ కాఫీ ఏదో హోటల్లోనే తాగుదాం పదండి

(ముగ్గురూ వెళ్ళిపోతూండగా మందుల మంగపతి భుజాన సంచితో వచ్చాడు ముగ్గురూ ఆగిపోయారు)

**సత్యా:** ఎవరండీ మీరు? ఎవరు కావాలి?

**మంగ:** నా పేరు మంగపతి! మందుల మంగపతి!

**గోపా:** మేమడిగింది మీపేరు కాదు ఇక్కడ మీకెవరు కావాలని?

**మంగ:** ఆ మాటకొస్తే మీరంతా కావలసిన వాళ్ళేనయ్యా!

**సత్యా:** మాతో మీకేంపని?

**మంగ.** చెప్తా! (అని అందరి మధ్యకూ వచ్చి ఒక సీసా తీసాడు) ఈ మందుపేరు మహిళా మటాష్ లోషన్!

**సత్యా** మహిళా...

**మంగ** మటాష్ లోషన్!

**గోపా** ఇక్కడ మహిళలు ఎవరూ లేరు!

**మంగ:** తెలుసునయ్యా! ఇది మహిళా మటాష్ లోషన్ అయినా-దీన్ని వాడవలసింది మగవాడే!

సత్యా: వాడితే ఏమవుతుంది!
మంగ. ఏమవుతుందో అనకాపల్లి అప్పారావు దొరగారిని అడుగు. బందరు బసవ రాజు గారి నడుగు
సుబ్బా. అబ్బా! వాళ్ళని అడిగే ఓపిక మాకు లేదండీ! మీరే చెప్పండి.
మంగ చెప్తాను చెప్పేముందు మీకు ఆడదాని గురించి తప్పకుండా చెప్పాలి. ఆడది ఆటంబాంబు లాంటిది! నీకు భార్యగా వస్తుంది. నీ గుండెల్లో ధామ్మని పేలు తుంది.
సుబ్బా నాకు అట్లాగే పేలుతోంది!
మంగ. క్షణంలో నవ్వుతుంది. ఉత్తర క్షణంలో ఏడుస్తుంది. ఈ విధంగా ఏడ్చి నవ్వి నీతో చెడుగుడు ఆడుతుంది. అసలు-భార్యంటే ఏమిటి?
సుబ్బా. ఆటంబాంబు?
మంగ: ఆ అవతారం ఎందుకు ఎత్తింది?
సత్యా: బుద్ధిలేక.
మంగ తప్పు నాయనా! సృష్టి రహస్యం తెలీక అజ్ఞానంగా మాట్లాడుతున్నావు. కిందటి జన్మలో ఆవిడ నీకు బద్ధ విరోధి ఆ జన్మలో నిన్నేం చేయలేక-ఈ జన్మలో నీకు భార్యగా పుట్టి నీచేత నీళ్ళు తాగిస్తుందన్న మాట!
సుబ్బా ఇదా సృష్టి రహస్యం?
మంగ అవున్నాయనా! అసలు తంతు పెళ్ళికివేసే శుభలేఖల్నుంచే తగులుకుం టుంది. శుభలేఖ అంటే అర్థం ఏమిటి?
గోపా. వెడ్డింగు కార్డు!
మంగ నా బొందర్థు! శుభలేఖ అంటే అరెస్టు వారెంటని అర్థం! పెళ్ళి పేరిట నిన్ను అరెస్టుచేసి సంసారమనే జైల్లో నిన్ను శాశ్వతంగా బంధిస్తుందన్నమాట-పెళ్ళిరోజున ఆమె మెళ్లో మూడుముళ్ళు వేసేది నువ్వే అయినా ఆ తర్వాత రోజుకో ముడి నీకే వేస్తుంది నీ దుంప తెంచుతుంది. అమాయకుప్పురుగు నాయనా మగాడు! అతన్ని కుక్కపిల్లనిచేసి కొంగున కట్టుకు తిరిగేది ఆడది! అట్లాంటి మనిషికి బుద్ధి చెప్పడం ఎట్లా?
సత్యా బడితపూజ చెస్తేసరి!
మంగ ఆ ధైర్యం మీకుందా?
గోపా. మాకుందిగానీ (సుబ్బారావుని చూపెడుతూ) వీడికి లేదు!
సుబ్బా, అవును స్వామీ నా బతుకు బాగుపడేదెట్లా?
మంగ మహిళా మహోష్ లోషన్! నీ కోసమే కనిపెట్టాను నాయనా! కొంచెం నాలుక మీద రాసుకో
సుబ్బా రాసుకుంటే-
మంగ ఆటోమేటిగ్గా వీరమొనగాడివై పోతావు. ధైర్యం తన్ను కొస్తుంది. పులై

పోతావు. కట్టుకున్నదాన్ని గడగడలాడిస్తావ్.

గోపా: (సుబ్బారావుతో) ఇదేదో బాగానే పుచ్చుకుంటుందిరా! ప్రయి చేస్తావెమిటో

సుబ్బా: ఆ మందేమిటన్నారు.

మంగ: మహిళా మిటాష్ లోషన్...

సుబ్బా: రేటెంత?

మంగ: రేటులేదు ఉచితం మగజాతిని ఉద్ధరించే ప్రయత్నంలో ఉన్నాను దీనికి రేటుండదు.

సుబ్బా: కొంచెం నా నాలుకమీద రాసుకోవచ్చా స్వామీ?

మంగ: రాసుకో నాయనా!

[అని సీసా యిచ్చాడు. కొంచెం నాలుక మీద రాసుకున్నాడు మంగపతి విజిల్ వేశాడు. సుబ్బారావు మారిపోతున్నాడు ఒక గుండీతీసి ఒటి నిండిపి ఛాతీని పొంగించి ఆకాశంవేపు చూస్తూ అరిచాడు].

సుబ్బా: శకుంతలా!

మంగ: శకుంతలెవరు నాయనా?

సత్యా: వాడి పెళ్ళాం!

మంగ: శుభం! పనిచేస్తుంది-మహిళా మిటాష్ లోషన్!

సుబ్బా: (కోపంగా) శకుంతలా! రెండు రోజులనుంచి అన్నం పెట్టకుండా ఉపోషం పెడుతున్నావు గదూ-చూడు నిన్నేం చేస్తానో? కూడెందుకు తిండానికి శకుంతలా! నిన్నే సుబ్బరంగా భోంచేస్తాను.

[అని వేగంగా వెళ్ళిపోతున్నాడు. మిగిలిన ఇద్దరితో చెప్తున్నాడు మంగపతి]

మంగ: ఆ మందు పసరు ఇకనైనా అతని గుణంలు-ట్రెండు ఘోరపర్చి పనిచేస్తుంది ఇతగాడు ఇంటికివెళ్ళి చేయబోయే కార్యక్రమం ఏమిటో చెప్పనా?

సత్యా: వేరే చెప్పనక్కర్లేదు. అర్థమవుతోంది.

మంగ: నీక్కూడా యివ్వమంటావా?

సత్యా: ఛీ...ఛీ... మందులు పుచ్చుకునే ఖర్మ నాకేంలేదు. వీడికేమైనా కావాలేమో అడగండి.

గోపా: ఛ...ఛ...ఏ మందూ లేకుండానే మా మాలతిని ఏలికేస్తున్నాను. ఇకమందు కూడా పడితే అది చచ్చిపోతుంది.

మంగ: మంచిది నాయనా వెళ్ళొస్తా!

[అని కదిలేడు.]

సత్యా: వెళ్ళండంతే! మళ్ళా రావద్దు!

(మంగపతి వెళ్ళిపోయాడు. గోపాలక్రిష్ణ అన్నాడు)

గోపా: ఒకవేళ వీడు మా వీధికిగాని వెళతాడేమో.

సత్యా: వెళ్ళనివ్వు!

**గోపా:** అమ్మో! ఆ వీధిలో మగాళ్ళంతా నాలాగే సింహాల్లా వుంటారు. వాళ్ళతో మాటాడితే ఇతని గాలి తీసేస్తారు. అటు వెళ్ళద్దని చెప్తారా? వుంటా.

(అని గోపాలకృష్ణ కూడా వెళ్ళిపోయాడు)

**సత్యా:** మహిళా మహోష్ లోషన్! [తండ్రి ఫొటో దగ్గరికి వెళ్ళాడు] చూసేవా నాన్నా! అవసరమైన మందుకూడా కొనుక్కోలేని పరిస్థితిలో పడిపోయి-బంగారం లాంటి ఛాన్సు పోగొట్టుకున్నాను. ఫ్రెండ్సు ముందు అడిగితే అలుసైపోతానని అడగలేను. ఆఫ్టరల్ సుబ్బిగాడు సిగ్గువిడిచి అడిగాడు. ఛందశాసనం ముందాకొడుకై పోయాడు. ఆపాటి అదృష్టం కూడా నాకు లేదా నాన్నా?

[అని కళ్ళు తుడుచుకుని తలుపు వేసేందుకు వెళ్ళబోతుంటే సావిత్రి వచ్చేసింది]

**సత్యా:** అప్పుడే వచ్చేసావ్? సినిమా అయిపోయిందా!

**సావి:** [నిష్ఠూరంగా] లేదు. ఏడుస్తూ పంపించారుగా! టిక్కెట్లు అందలేదు.

**సత్యా:** అయ్యయ్యో!

**సావి:** మీరేం విచారించక్కర్లేదు లెండి. ఫస్టుషోకి రిజర్వు చేసుకుని వచ్చాం!

**సత్యా:** వచ్చాం అంటున్నావు. నీకో తోడు కూడా వున్నారా ఏమిటి?

**సావి:** వుంటే తప్పా?

**సత్యా:** అనికాదు! ఈ విధంగా పంతంపట్టి సినిమాలకెళ్ళే ఉత్తమ ప్రేక్షకురాలు ఎవరా అని?

**సావి:** మాలతి!

**సత్యా:** [ఆ పేరు వినగానే షాకయ్యాడు] మాలతా? మాలతి అంటే మా గోపాల క్రిష్ణ పైపు కదూ?

**సావి:** మీ గోపాలక్రిష్ణగారి సతీమణే! అయితే ఏమైందిట?

**సత్యా:** ఒక జీవితసత్యం తెలిసింది. ఒక గోపాలక్రిష్ణ అర్థమయ్యాడు. ఇంతకీ మీరు చూడబోయే సినిమా ఏమిటో?

**సావి:** పతిభక్తి!

**సత్యా:** పతిభక్తా? ఆహా...అందమైన పేరు! అవునూ-ఆ పతిభక్తిని మొన్నేగా చూశావు?

**సావి:** చూసిన సినిమా మళ్ళీ మళ్ళీ చూస్తే తప్పా?

**సత్యా:** కాదనుకో! ఆ సినిమాలో పతిభక్తి గురించి మంచి పాయింట్లేమైనా వున్నాయా?

**సావి:** అట్లా ఎందుకనుకోవాలి?

**సత్యా:** చూసిన సినిమానే చూస్తున్నారంటే

**సావి:** అదేంకాదు మాలతికి లెక్కలురావు ఎప్పుడూ తప్పే చెప్తుంది!

**సత్యా:** సినిమాకీ లెక్కలకీ సంబంధ మేమిటి?

**సావి:** పతిభక్తిలో హీరోయిన్ పదహారుసార్లు చీరలు మార్చింది నేను కరెక్టు?

లెక్క పెట్టాను పద్దెనిమిదిసార్లు మార్చిందని మాలతి పందెం కాసింది!
సత్యా: సినిమాలో కూడా చీరెల లెక్కేమిటి?
సావి: లెక్క లెక్కేమరి! సరైన చీరెల లెక్క తేలేంతవరకు ఎన్నిసార్లయినా చూస్తాం-పతిభక్తి!
[అని వంట గదిలోకి వెళ్ళింది]
సత్యా భగవాన్-తెలుగు సినిమాలు వందేసి రోజులు ఎందుకు ఆడుతున్నాయో ఇప్పుడు బాగా అర్థమైంది స్వామీ!
సావి. [లోపల్నించి అరిచింది] ఏమండీ ..
సత్యా. ఓయ్!
[పగిలిన కప్పు సాసర్లతో వచ్చింది సావిత్రి]
సావి: బంగారం లాంటి వస్తువుల్ని పగలకొట్టింది మీరేనా?
సత్యా. [భయంగా] నేనా? నో నో. నేను కాదు!
సావి చాల్లెండి అబద్ధాలు. మిమ్మల్ని సినిమాకి తీసుకెళ్ళలేదని, వళ్ళుమంటకొద్దీ పగలగొట్టారు అవునా?
సత్యా [నిప్పు కారిపోతూ] తమరిదయ! నాకు వళ్ళు మండటం ఎప్పుడైనా వుందా? మండినా నీ కిష్టమైన వస్తువులు పగులగొట్ట గలనా?
సావి. మరి ఎట్లా పగిలేయి?
సత్యా కొంచెం కునుకు పట్టింది సావిత్రీ! అప్పుడు పిల్లిలో ఎలుకలో ..
సావి [ఖంగారుగా] అంటే? అంటే వంటపని మానేసి నిద్రపోయారా?
సత్యా. ఏమిటో పాడునిద్ర ముంచుకొచ్చేసింది సావిత్రీ!
సావి [కోపంగా] ముంచుకొస్తుందండీ! ముంచుకొస్తుంది! మీకు నిద్ర రాకుండా ఏంచేయాలో నాకు బాగా తెలుసు
సత్యా ఆ చిట్కా ఏంటో నాకూ చెప్పు సావిత్రీ సుఖపడిపోతాను. నావంట నేనే చేసుకుని, నాతిండి నేనే తింటాను!
సత్యా: [గాభరాగా] మరి నా వంటా? నా తిండీ?
సావి: పస్తే! పంచక్కా నిద్రపోతూ పస్తు పడుకోండి.
[అని గదిలోకి వెళ్ళిపోయింది కొంతదూరం ఆమెను వెంబడిస్తూ ప్రాధేయపడ్డాడు]
సత్యా సావిత్రీ! ఇది నీకు న్యాయంకాదు సావిత్రీ! [ఆమె వెళ్ళిపోయింది అతను గుమ్మం బయటేనిలబడి తలుచుకున్నాడు] ఎక్కడున్నావయ్యా-మందుల మంగపతి.
మంగ [లోపలికి వచ్చి] పిలిచేవా నాయనా!
సత్యా. [ఆశ్చర్యంగా] అమ్మో! పిలవలేదు స్వామీ! తలుచుకున్నాను! మీరు వచ్చేశారు!
మంగ అంతే నాయనా! తలుచుకున్నా, పిలుచుకున్నా వెలుస్తాను.
సత్యా. మా ఫ్రెండు మీకేం చెప్పలేదా?

**మంగ:** ఏమీ చెప్పలేదు గానీ-మూడు సీసాలు పుచ్చుకున్నాడు మహిళా మటాష్ లోషన్!

**సత్యా:** అలాగా! బాబ్బాబు నాకు అర్జంటుగా అరడజను సీసాలు యిప్పించండి. చాలా అవసరం!

**మంగ:** [సంచిలో చెయ్యి పెట్టి] తథాస్తు.

తెరవాలుతుండగా క్రింద ప్రకటన వినిపిస్తుంది-మహిళా మటాష్ లోషన్ కావలసిన వారు సంస్థ కార్యదర్శినిగాని, కార్యకర్తలనిగాని కల్సుకోవాలి.


## కల నిజమాయెలే!!

కలలనగానే యువతీయువకులలో పులకరింతలు మొదలవుతాయి. చాలా మందికి వాస్తవజీవితం కంటే కలలజీవితమే, అందంగా అనిపిస్తుంది. అద్భుతంగా అగుపిస్తుంది, అపూర్వంగా అపురూపంగా మిగులుతుంది.

కలలు ప్రతి మనిషికీ వస్తాయి కలలురాని మనిషంటూ లోకంలో ఎవరూ ఉండరు

**అందుకే జ్యోతి త్వరలో మీ కోసం**

**ఓ అద్భుతమైన కానుక**

**'నవలానుబంధం' రూపంలో కలలపై**

**సమగ్రమైన విశ్లేషణ అందిస్తోంది**

**ఎదురుచూడండి**